కులం, మతం పేరుతో ఓట్లు అడగొద్దు

- రోడ్ షోలో పటాకులు కాల్చొద్దు
- వాహదారులకు ఇబ్బంది కలిగించొద్దు
- ఈసీ మార్గదర్శకాలు జారీ

హైదరాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ): ఎన్నికల రోడ్ షోలు, ర్యాలీల్లో పటాకులు పేల్చడానికి అనుమతి లేదని కేంద్రం ఎన్నికల సంఘం (ఈసీ) స్పష్టం చేసింది. ఎన్నికల ప్రచారానికి సంబంధించి మార్గదర్శకాలు జారీ చేసింది.

ఇవే మార్గదర్శకాలు

- అధికారిక వాహనాలను ఎన్నికల ప్రచారంలో ఉపయోగించవద్దు
- కాన్వాయ్‌లో పది వాహనాల కంటే ఎక్కువగా ఉండొద్దు (సెక్యూరిటీ వాహనాలు కాకుండా). ఒకవేళ ఎక్కువ సంఖ్యలో వాహనాలు ఉంటే అవి 100 మీటర్ల దూరంలో ఉండే విధంగా చూడాలి.
- ఒక బైక్ మీద ఒక జెండాను మాత్రమే పెట్టాలి. జెండా సైజు 1 అడుగు x ఆర అడుగు మాత్రమే ఉండాలి. జెండా కర్ర మూడు అడుగుల కంటే ఎక్కువ పొడవు ఉండకూడదు.
- రోడ్ షోలను సెలవు రోజుల్లో నిర్వహించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలి. పీక్ అవర్స్‌లో కాకుండా ఇతర సమయాల్లో ర్యాలీలు నిర్వహించాలి. దవాఖానలు, బ్లడ్ బ్యాంకులు, ట్రామా కేర్ సెంటర్ల దగ్గర రోడ్ షోలను నిర్వహించవద్దు. రోడ్‌ను పూర్తిగా బ్లాక్ చేయవద్దు. వాహనాలు వెళ్లేందుకు ఒకవైపు ఖాళీగా ఉంచాలి. రోడ్ షోలో ఎంత మంది పాల్గొంటున్నారనేది ముందుగానే సమాచారం ఇవ్వాలి.
- గరిష్ఠంగా బ్యానర్ సైజ్ 6X4 మాత్రమే ఉండే విధంగా చూడాలి.
- విద్యా సంవత్సరానికి ఆటంకం కలిగే విధంగా పాఠశాలలు, కళాశాలల్లో సభలు, సమావేశాలు నిర్వహించవద్దు. సభలు, సమావేశాలకు ఆయా విద్యా సంస్థల నుంచి ముందుగానే అనుమతి తీసుకోవాలి. ముందుగా వచ్చిన వారికి ముందుగా కేటాయింపు విధానంలో స్కూల్, కాలేజీ స్థలాలను కేటాయించాలి.
- దేవాలయాలు, చర్చిలు, మసీదు, గురద్వార్‌లను ఎన్నికల ప్రచారానికి వినియోగించడానికి వీలులేదు.
- కులం, మతం ఆధారంగా ఓట్లు అడగడానికి వీలులేదు. కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టేలా ప్రవర్తించకూడదు.
- వ్యక్తిగత దూషణలు, విమర్శలు వద్దు. అభ్యంతరకర మెసేజ్‌లను ఓటర్లకు పంపకూడదు.
- తాత్కాలికంగా ప్రారంభించే పార్టీ కార్యాలయాలు పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల దూరంలో ఉండాలి.

లక్ష రూపాయలకు లెక్క చెప్పాలి

ఒక అకౌంట్ నుంచి లక్ష రూపాయలు డిపాజిట్ చేసినా, విత్ డ్రా చేసిన ఆ వివరాలను అందించాలని బ్యాంకులకు ఎన్నికల సంఘం సూచించింది. ఒక బ్యాంకు అకౌంట్ నుంచి అనేక బ్యాంకు అకౌంట్‌లకు ఆర్‌టీజీఎస్ ద్వారా డబ్బులు జమ చేస్తుంటే వాటి సమాచారాన్ని ఇవ్వాలని కోరింది. అభ్యర్థి లేదా ఆయన కుటుంబ సభ్యులు ఏవరైనా లక్ష రూపాయల కంటే ఎక్కువగా నగదు డ్రా చేసి ఉంటే ఆ సమాచారాన్ని అందించాలని ఆదేశించింది. రాజకీయ పార్టీల అకౌంట్‌ల నుంచి ఒక లక్ష రూపాయలు జమ చేయడం, డ్రా చేయడం చేస్తే వాటి వివరాలను అందించాలని తెలిపింది. ఈ మేరకు మంగళవారం బ్యాంకుల ప్రతినిధులకు ఈసీ లేఖ రాసింది.

13 శాఖలకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం

పోలింగ్ రోజున విధుల్లో ఉండే 13 అత్యవసర శాఖల ఉద్యోగులకు పోస్టల్ ఓటు హక్కును ఈసీ కల్పించింది. ఎన్నికల రోజు విధుల్లో ఉండే జర్నలిస్టులు సైతం పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చు.

పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం ఉన్న శాఖలు

ఎయిర్‌పోర్ట్ ఆథారిటీ ఆఫ్ ఇండియా, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, రైల్వే, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియో, విద్యుత్, కుటుంబం, వైద్య సంక్షేమం, ఆర్టీసీ, సివిల్ సప్లయ్, బీఎస్ఎన్ఎల్, పోలింగ్ రోజు ఎన్నికల్లో విధుల్లో ఉండే మీడియా ప్రతినిధులు, ఫైర్ సర్వీసెస్.

నెమలిని కాల్చి చంపిన దుండగులు

- కారులో తరలిస్తుండగా ఇద్దరి అరెస్ట్
- తుపాకీ, గొడ్డలి, బుల్లెట్ల స్వాధీనం
- జగిత్యాల డీఎస్పీ వెల్లడి
- 2017లో జింకను చంపిన కేసులోనూ సత్యనారాయణ నిందితుడు

పెగడపల్లి, మార్చి 19: జాతీయ పక్షి నెమలిని ఇద్దరు దుండగులు వేటాడి తుపాకీలో కాల్చి చంపిన ఘటన జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం దోమలకుంట సమీపంలోని ఎస్సారెస్పీ కాలువ వద్ద చోటుచేసుకున్నది. జగిత్యాల డీఎస్పీ డీ రఘుచందర్ మంగళవారం మీడియాకు వెల్లడించిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లికి చెందిన రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి నలువాల సత్యనారాయణ, జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రానికి చెందిన జువ్వాజి రాజు సోమవారం రాత్రి దోమలకుంట సమీపంలో నెమలిని వేటాడి తుపాకీతో కాల్చి చంపారు. తర్వాత కారులో తరలిస్తుండగా, విషయం తెలియడంతో ఎస్సై రామకృష్ణ వెంటనే సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టగా, సత్యనారాయణ, జువ్వాజి రాజు ప్రయాణిస్తున్న కారు అనుమానాస్పదంగా కనిపించింది. అందులో లైసెన్స్ లేని తుపాకీ, గొడ్డలితోపాటు 34 బుల్లెట్లు, నెమలి కళేబరాన్ని స్వాధీనం చేసుకున్నారు. తర్వాత నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా, సత్యనారాయణ 2017లో భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ జింకలను హత మార్చిన కేసులో ప్రధాన నిందితుడని, ఆ కేసు ఇంకా నడుస్తున్నదని డీఎస్పీ తెలిపారు. సత్యనారాయణ కుమారుడు ఉమ్మడి వరంగల్ జిల్లాలో డీఎస్పీ పనిచేస్తున్నారు.

25 కుక్కలను కాల్చిన ముగ్గురి రిమాండ్

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, మార్చి 19: మహబూబ్‌నగర్ జిల్లా పాన్నకల్‌లో గతనెల అర్ధరాత్రి వీధి కుక్కలను గన్‌తో కాల్చి చంపిన కేసును ఛేదించినట్టు ఎస్పీ హర్షవర్ధన్ తెలిపారు. ఓ పెంపుడు కుక్కను కరిచి హతమార్చడమే కాకుండా మరో పెంపుడు కుక్కను కరిచి గాయాల పాలుచేయడంతో కోపంతో 25 వీధి కుక్కలను రైఫిల్‌తో మంద నర్సింహారెడ్డి కాల్చి చంపినట్టు వెల్లడించారు. మంగళవారం సాయంత్రం మహబూబ్‌నగర్‌లో కేసు వివరాలను మీడియాకు తెలిపారు. రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం దేవునిపల్లి పంచాయతీ పరిధిలోని చించోడ్‌కు చెందిన మందా నర్సింహారెడ్డి హైదరాబాద్‌లోని లక్డీకాపూల్‌లో ఉంటున్నాడు. ఫిబ్రవరి 15 న అత్తగారి ఊరైన అడ్డాకుల మండలం పాన్నకల్‌కు కుటుంబ సభ్యులతోపాటు పెంపుడు కుక్కలతో వచ్చాడు. గ్రామంలోని వీధి కుక్కలు ఇతని పెంపుడు కుక్కను చంపగా మరో కుక్కను గాయపరిచాయి. ఫలక్‌నుమాకు చెందిన తారీఖ్ హైమద్, మహ్మద్ తాహేతో కలిసి నర్సింహారెడ్డి గత నెల 16న అర్ధరాత్రి దాటిన తరువాత తన బెంజ్ కారులో తిరుగుతూ.. లైసెన్స్‌డ్ వెపన్ 22 రైఫిల్‌తో గ్రామంలో కనిపించిన 25 కుక్కలను కాల్చారు. వీటిలో 20 శునకాలు చనిపోగా.. మరో ఐదు గాయపడ్డాయి. పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ జరిపి నర్సింహారెడ్డితోపాటు తారీఖ్ హైమద్, మహ్మద్ తాహేర్‌లపై మూగజీవుల సంరక్షణ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి మంగళవారం అరెస్టు చేశారు. వీరి నుంచి రైఫిల్, బెంజ్ కారు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ తెలిపారు.

నిబంధనల ప్రకారమే మైనింగ్‌పై చర్యలు

రాష్ట్ర మైన్స్ అండ్ జియాలజీ డైరెక్టర్ వెల్లడి

హైదరాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో చిన్నతరహా ఖనిజ కార్యకలాపాల నియంత్రణ (రెగ్యులేషన్ ఆఫ్ మైనర్ మినరల్స్) చట్టంలో భాగంగానే క్వారీలు, మైనింగ్‌పై చర్యలు చేపడుతున్నట్టు రాష్ట్ర మైన్స్ అండ్ జియాలజీ శాఖ డైరెక్టర్ సుశీల్‌కుమార్ స్పష్టంచేశారు. నిబంధనల ప్రకారమే మైనింగ్, క్వారీ లీజులపై సర్వే నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 'నమస్తే తెలంగాణ'లో మంగళవారం 'రాష్ట్రంలో కంకర కష్టాలు' శీర్షికతో ప్రచురితమైన వార్తపై డైరెక్టర్ స్పందించారు. మంజూరైన లీజులు, తవ్వకాలకు తేడా ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం మూడేండ్లకోసారి మైనర్ మినరల్స్‌కు సంబంధించి సీనరేజీ ఫీజు, డీడ్ రెంట్ సవరించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని తెలిపారు. ఇందులో భాగంగా 2015 లో సవరించిన ఫీజులను ఏడేండ్ల తర్వాత 2022, ఏప్రిల్‌లో సవరించామని, రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా లీజుదారులకు పర్మిట్ ఫీజును ప్రవేశపెట్టిందని వెల్లడించారు.

కొండగట్టు టెండర్‌లో గోల్‌మాల్ నిజమే

నమస్తే ఎఫెక్ట్

- రికార్డుల పరిశీలన తరువాత వెల్లడించిన అధికారులు
- 14.49 లక్షలు స్వాహా అయినట్టు గుర్తింపు
- మరిన్ని లోపాలున్నట్టు ప్రాథమికంగా అంచనా

మల్యాల, మార్చి 19: కొండగట్టు అంజన్న క్షేత్రంలో దేవాదాయ శాఖ అధికారులు మంగళవారం సోదాలు చేశారు. 'కొండగట్టు లీజులో గోల్‌మాల్' అంటూ ఈ నెల 18న 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి దేవాదాయ కమిషనర్ హన్మంతరావు స్పందించారు. విచారణకు ఆదేశించగా అదనపు కమిషనర్ జ్యోతి, అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ మంగళవారం కొండగట్టు అంజన్న క్షేత్రానికి వచ్చారు. రెండు బృందాలుగా విడిపోయి ఆలయ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. కాగా, దుకాణాల లీజు సొమ్ముల వసూళ్లలో రూ.11.20 లక్షల గోల్‌మాల్ జరిగిందని 'నమస్తే' బహిర్గతం చేయగా, అధికారులు రూ.14.49 లక్షలు గోల్‌మాల్ జరిగినట్టు గుర్తించడం విశేషం. ఆలయంలో 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాలకు గాను దుకాణాల టెండర్లకు సంబంధించి విచారణ చేపట్టినట్టు దేవాదాయ కమిషనర్ జ్యోతి తెలిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.14,49,900 దుకాణ యజమానుల నుంచి వసూలు చేసి ఆలయానికి చెల్లించలేదని వెల్లడించారు. దుకాణదారుల నుంచి సొమ్ము వసూలైనట్టు డిమాండ్ కలెక్షన్ బుక్ (డీసీబీ)లో సంబంధిత సెక్షన్ ఇన్‌చార్జి, ఆలయ పర్యవేక్షకుడు, ఈవో సంతకం చేశారన్నారు. అట్టి నగదును బ్యాంక్‌లో జమ చేశారా..? లేదా అనే విషయాన్ని సూపరింటెండెంట్, ఈవో పరిశీలించకుండానే ఎలా సంతకం చేశారనే.. అంశంపై దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్‌కు బుధవారం నివేదిక సమర్పించనున్నట్టు చెప్పారు. 2023-2024 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.38 లక్షలు లెక్కచూపని ఓ ఉద్యోగిని సస్పెండ్ చేసినట్టు పేర్కొన్నారు. 2018-2019 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లెక్కలు పరిశీలిస్తే, ఆ ఏడాదిలో సైతం దుకాణాదారుల నుంచి వసూలు చేసిన మొత్తాలను బ్యాంక్‌లో జమచేయనట్టు ఆడిట్ అధికారుల అభ్యంతరాలు తెలిపినట్టు ఉన్నట్టు ఆమె వెల్లడించారు. అందుకు సంబంధించిన నగదు పుస్తకాలను సీజ్ చేసినట్టు చెప్పారు.



సంకాపురంలో బోరుకు కొత్త మోటర్‌ను బిగిస్తున్న సిబ్బంది

'బోరు మోటర్' విరాళాలు వాపస్

- గ్రామాన్ని సందర్శించిన అధికారులు
- తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

అయిజ రూరల్, మార్చి 19 : బోరు కోసం చందాలు వేసుకొన్న మొత్తాన్ని అధికారులు వాపస్ చేశారు. జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం సంకాపురంలో నాలుగు రోజులుగా నీటి ఎద్దడి నెలకొన్నది. అధికారులకు విషయం చెప్పినా పట్టించుకోవడం లేదని ఇంటికి రూ.200 చొప్పున బోరు మోటరు మరమ్మతుకు స్థానికులు విరాళాలు సేకరించారు. ఈ విషయమై మంగళవారం 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో 'బోరు కోసం.. ఊరు విరాళం' అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులు గ్రామంలో పర్యటించి తాగునీటి ఇబ్బందుల గురించి ఆరా తీశారు. ఈ సమయంలో అధికారులకు, గ్రామస్థులకు మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకున్నది. పైపులైన్ మరమ్మతు పనులు త్వరలో పూర్తి చేయించడంతోపాటు తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో స్థానికులు శాంతించారు. గ్రామస్థులు సోమవారం మోటర్ కోసం పోగు చేసుకున్న రూ.26 వేలను అధికారులు తిరిగి చెల్లించారు.

చట్నీస్‌లో ఐటీ సోదాలు

హైదరాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ) : ప్రముఖ టిఫిన్స్ హోటల్ సంస్థ చట్నీస్‌పై మంగళవారం ఐటీ అధికారులు సోదాలు చేపట్టారు. ఆ సంస్థకు చెందిన అనేక టిఫిన్ సెంటర్లపై ఏకకాలంలో తనిఖీలు నిర్వహించారు. అదేవిధంగా హైదరాబాద్ కేంద్రంగా నడుస్తున్న మేఘన ఫుడ్స్, ఈటరీస్‌లోనూ ఐటీ అధికారులు సోదాలు చేపట్టారు. ఈ దాడులకు సంబంధించి హోటళ్ల యజమానులతో పాటు ఐటీ అధికారులు ఎలాంటి ప్రకటనా చేయలేదు. తాజాగా సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని రాయదుర్గం, మొయినాబాద్, కోకాపేటలో సోదాలు సాగినట్టు సమాచారం. ఓ ఫార్మా కంపెనీతోపాటు మరో తొమ్మిది చోట్ల ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఐటీ దాడులు జరగడం సంచలనంగా మారింది.

119 నియోజకవర్గాల్లో 357 బృందాలు

హైదరాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా రాష్ట్రంలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి మూడు ప్రత్యేక ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించారు. మొత్తం 119 నియోజకవర్గాలకు కలిపి 357 బృందాలను ఏర్పాటు చేశారు. వీటితోపాటు 357 చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు.

పే స్కేల్ ఆధారంగానే ఆర్టీసీ ఉద్యోగులకు హెచ్ఆర్ఏ

హైదరాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ): ఉద్యోగులకు పేస్కేల్ ఆధారంగానే హెచ్ఆర్ఏ ఖరారు చేసినట్టు టీఎస్ఆర్టీసీ స్పష్టంచేసింది. తాజాగా 2017 పే స్కేల్ రివిజన్ చేసి ఉద్యోగులకు 21శాతం ఫిట్‌మెంట్ ప్రకటించినట్టు వెల్లడించింది. జీవో నంబర్ 53 ప్రకారం 2020లో ఆర్టీసీ ఉద్యోగులకు హెచ్ఆర్ఏ సవరణ చేయాలని అప్పటి ప్రభుత్వం ఆదేశించినా పట్టించుకోలేదని పేర్కొన్నది. దీంతో హెచ్ఆర్ఏ తాత్కాలికంగా నిలిపివేసినట్టు తెలిపింది. తాజాగా పే స్కేల్ సవరణ చేయడంతో హెచ్ఆర్ఏ 17% నిర్ణయించడమైందని స్పష్టం చేసింది. కానీ, సోషల్ మీడియాలో, పత్రికల్లో ఆర్టీసీ హెచ్ఆర్ఏకు కోత పెట్టిందనే విధంగా తప్పుడు ప్రచారం జరుగుతుందని ఆర్టీసీ యాజమాన్యం పేర్కొన్నది. ఆర్టీసీ ఉద్యోగుల హెచ్ఆర్ఏలో ఎలాంటి కోత విధించలేదని తెలిపింది.